

మారిషస్ అధ్యక్షుడితో రవిశంకర్

### మాదకద్రవ్య రహిత మారిషస్ సాధనకు కృషి

**ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్**

బెంగళూరు, సెప్టెంబర్ 6: మాదక ద్రవ్య రహిత మారిషస్‌ను సాధించడం సహా, యువతకు స్వయం సమృద్ధి, సాధికారిత కలిగించే పథకాల గురించి అవగాహన కల్పించేందుకు తాము కృషి చేస్తామని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీశ్రీ రవి శంకర్ పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం గురువారం మారిషస్‌కు చేరుకున్న ఆయనకు ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సింగ్ రూపన్, ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్నౌథ్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ప్రధానితో జరిగిన సమావేశాల్లో ఆయన మారిషస్‌కు ఆయుర్వేదాన్ని పరిచయం చేయడం, అక్కడి ఖైదీలపై విస్తృత ప్రభావం చూపిన యోగ శిక్షణ కార్యక్రమాల విస్తరణ వంటి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఖైదీలలో మానసిన పరివర్తన తేవడానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ చేపట్టిన ప్రిజన్ స్మార్ట్ కార్యక్రమాలు కొనసాగించడం కోసం అక్కడి ప్రభుత్వంతో అంగీకార పత్రంపై సంతకాలు చేయనున్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన వినేశ్, పునియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ఒలింపియన్ రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు వారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిశారు. కాంగ్రెస్‌లో చేరిన ఫోగట్, పునియా రైల్వేలో తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. బజరంగ్ పునియాను ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వర్కింగ్ చైర్మన్‌గా ఏఐసీసీ నియమించింది.

**31 మందితో కాంగ్రెస్ జాబితా**

హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు 31 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితాను శుక్రవారం విడుదల చేసింది. వినేశ్ ఫోగట్‌ను జులానా నుంచి బరిలో నిలిపింది.

**హర్యానా బీజేపీకి వరుస షాక్‌లు**

అసెంబ్లీ ఎన్నికల కోసం 67 మంది బీజేపీ విడుదల చేసిన మొదటి లిస్టులో 40 మందిని మార్చడం పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. టికెట్ దక్కని మంత్రి రంజిత్ చౌతాల, మాజీ మంత్రి సావిత్రి జిందాల్, పలువురు నేతలు రాజీనామా చేశారు. మరోవైపు అత్యాచార కేసులో దోషి అయిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్(డేరా బాబా)కు ఆరుసార్లు పెరోల్ ఇచ్చిన జైళ్ల శాఖ మాజీ అధికారి సునీల్ సంగ్వన్‌కు బీజేపీ దాద్రి టిక్కెట్ ఇవ్వడం వివాదంగా మారింది.



### ఎస్వతిని రాజు 16వ భార్యగా దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడి కుమార్తె

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా కుమార్తె నొమ్సెబో జుమా (21), ఎస్వతిని రాజు ఎంస్వతి-2 (56) మధ్య ప్రేమ చిగురించింది. సంప్రదాయ నృత్య సంబరాల్లో పాల్గొన్న నొమ్సెబోను రాజవంశపు పెండ్లి కుమార్తెగా ప్రకటించారు. వీరి వివాహం త్వరలో జరగబోతున్నది. ఎంస్వతి-2కు ఇది 16వ వివాహం. ఆయనకు ప్రస్తుతం 11 మంది భార్యలు ఉన్నారు. నొమ్సెబో ఆయనకు 16వ భార్య కాబోతున్నారు. కింగ్ ఎంస్వతి, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా బంధువులే.

### హత్రాస్ రోడ్డు ప్రమాదంలో 15 మంది మృతి

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో శుక్రవారం ఓ బస్సు, వ్యాను ఢీకొనడంతో 15 మంది మరణించగా, 16 మంది గాయపడ్డారు. గాయపడినవారిని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు అధికారులు చెప్పారు. ఆగ్రా-అలీగఢ్ జాతీయ రహదారిపై బస్సు ఓ వ్యానును ఢీకొట్టింది. కన్వర్‌పూర్ గ్రామం వద్ద ఈ దారుణం జరిగింది. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50,000 చొప్పున ఆర్థిక సాయాన్ని మోదీ ప్రకటించారు.

# దివాలా దిశగా.. కాంగ్రెస్ రాష్ట్రాలు!

- అడ్డగోలు ఉచిత పథకాలతో అప్పుల కుప్పగా రాష్ట్రాలు
- నిన్న హిమాచల్ ప్రదేశ్, నేడు కర్ణాటక, తెలంగాణ
- ఆమ్ ఆద్మీ పార్టీ పాలిత పంజాబ్ రాష్ట్రానిదీ అదే దారి
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనాలోచితంగా హామీలు
- ఖజానాపై పెను భారం.. దీంతో ప్రజలపై పన్నుల పోటు
- సబ్సిడీల్లో కోత, ధరల పెంపు, జీతాలు, చెల్లింపులు వాయిదా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అధికారమే పరమావధి. దీని కోసం ఎన్ని హామీలైనా గుమ్మరించాలి. అర్హులు ఎవరు? ఎవరు కాదు? అనేది తర్వాత ముచ్చట. గ్యారెంటీలు అమలు చేయగలమా? లేదా? అనే చర్చ వద్దేవద్దు. ముందు ఓటర్లను ఆకర్షించాలి. ఉచిత పథకాలతో మురిపించాలి. అధికారంలోకి రావాలి. తీరా.. అధికారంలోకి వచ్చాక.. నిధుల కటకట మొదలవుతుంది. అనాలోచితంగా ప్రకటించిన హామీలతో రాష్ట్రాలకు రాష్ట్రాలే దివాలా తీసే దుస్థితి దాపురిస్తుంది. నిన్న హిమాచల్ ప్రదేశ్, ఇప్పుడు పంజాబ్, కర్ణాటకలో పరిస్థితులను చూస్తే ఇదే విషయం అర్థమవుతున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ తీసుకొచ్చిన ఉచిత స్కీమ్‌లను ఫాలో అయిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు గ్యారెంటీల పేరిట అడ్డగోలు హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. అయితే, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చే దారి లేక ఇప్పటికే పలు గ్యారెంటీల్లో కోతలు పెట్టింది. ప్రజలపై పన్నుల భారం మోపింది. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల బకాయిలను కూడా చెల్లించట్లేదు. ఇక, ఎన్నికల ముందు 10 గ్యారెంటీలతో ఆశ పెట్టి హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన అదే కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది. తొలుత ఉచితాలతో మభ్యపెట్టిన పంజాబ్‌లోని ఆప్ సర్కారుకు కూడా ఈ సెగ తగిలింది. పర్యావసనంగా ఇప్పుడు ఆ రాష్ట్రమే దివాలా తీసే ప్రమాదం ఏర్పడింది. దీంతో సబ్సిడీల్లో కోత పెట్టడమే కాకుండా.. పన్నుల వాతకు ఆ సర్కారు శ్రీకారం చుట్టింది.





**పంజాబ్‌లో కోతలు.. వాతలు**

పెరుగుతున్న అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ సర్కారు కోతల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. విద్యుత్తు సబ్సిడీలో కోత, పెట్రో పన్నుపై వాతతో ప్రజలపై భారాన్ని మోపేందుకు నిర్ణయించింది. పెట్రోల్‌పై 61 పైసలు, డీజిల్‌పై 92 పైసలు వ్యాట్‌ను విధించిన భగవంత్ మాన్ ప్రభుత్వం.. గృహ వినియోగదారులకు సబ్సిడీ విద్యుత్తు పథకాన్ని ఉపసంహరించుకొన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి పంజాబ్ అప్పులు రూ. 3.74 లక్షల కోట్లకు చేరుతాయని బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది. అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి సబ్సిడీల్లో కోత, పన్నుల పెంపును ఓ మార్గంగా చూస్తున్నది.

**కర్ణాటకలో అలా.. తెలంగాణలో ఇలా**

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో.. ఆరు గ్యారెంటీల ఆర్భాటంతో తెలంగాణలో గెలిచిన కాంగ్రెస్‌కు అసలు తత్వం ఇప్పుడు బోధ పడుతున్నది. గ్యారెంటీల అమలు కర్ణాటకపై పెను ఆర్థిక భారాన్ని మోపింది. దీంతో ధరలు పెంచి, ఖజానా నింపేందుకు సిద్ధరామయ్య సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల మేర బిల్లులను ఆలస్యం చేయడంతో అభివృద్ధి పనులకు ఎక్కడికక్కడ బ్రేకులు పడుతున్నాయి. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా హామీల అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సర్కారు చెప్తున్నప్పటికీ లబ్ధిదారులు అందరికీ అందడం లేదన్నది బహిరంగ రహస్యమే.

**హిమాచల్ విలవిల**

2022 చివర్లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు హిమాచల్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. రాష్ట్రం మొత్తం అప్పులే రూ. 86,589 కోట్లకు చేరాయి. ఇదేమీ పట్టించుకోకుండా ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, ఏకంగా 14 సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది.

## కాంట్రాక్టర్లకు 25 వేల కోట్ల బకాయిలు

**కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఇదీ పరిస్థితి**

*బెంగళూరు: కర్ణాటకలో అభివృద్ధి పనులకు బ్రేకులు పడుతున్నాయి. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోతున్నాయి. దీంతో బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పనులు జరిపామని, ఇక బిల్లులు రాకపోతే పనులు కొనసాగించలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలనే యావతో ఇచ్చిన గ్యారెంటీలే ఇప్పుడు రాష్ట్రం పాలిట గుదిబండగా, అభివృద్ధికి అడ్డంకిగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.*

*కర్ణాటకలో గత ఏడాది మే నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేటప్పటికి కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మారాక తమ బిల్లులు మంజూరవుతాయని ఆశించారు. కానీ, బిల్లుల బకాయిలు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్లకు పెరిగాయి. దీంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు వేగంగా జరపడం లేదు. చాలా పనులు నిలిచిపోయాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె సైతం కాంట్రాక్టర్లకు రూ.3,200 బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నగరంలో పనులు వేగంగా జరగడం లేదు.*

***అయినవారికే చెల్లింపులు***

*బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం సీనియారిటీ నిబంధనలను పాటించడం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న వారికి అనుకూలమైన కాంట్రాక్టర్లకు మొదట బిల్లులు చెల్లిస్తున్నారని వాపోతున్నారు.*

## పెట్రో బాదుడికి విముక్తి ఎప్పుడో!

- అంతర్జాతీయ విపణిలో 9 నెలల కనిష్ఠానికి క్రూడాయిల్ ధరలు
- బ్యారెల్ ధర 70 డాలర్లకు దిగువే అయినప్పటికీ, తగ్గించని కేంద్రం
- పదేండ్లలో డీజిల్‌పై 43%, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ డ్యూటీ వడ్డింపు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పెరిగిన నిత్యావసరాల ధరలతో కుదేలవుతున్న సామాన్యుడిని రోజురోజుకూ పెరగడమే తప్ప తరగని పెట్రోలు, డీజిల్ ధరలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున వాటి ధరలు ఇప్పుడైనా కేంద్రం తగ్గిస్తుందేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో బ్యారెల్ ముడిచమురు ధర 9 నెలల కనిష్ఠానికి చేరినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను మాత్రం కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఇంకా తగ్గించట్లేదు. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల దిగువకు చేరింది. అయినప్పటికీ, దేశీయంగా లీటర్ పెట్రోల్ ధర రూ. 109, డీజిల్ ధర రూ. 97గానే ఉన్నది. కాగా, మోదీ ప్రధానిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన 2014లో లీటర్ పెట్రోల్ ధర రూ.71 ఉంటే ప్రస్తుతం ఇది రూ.109కు పెరిగింది. అప్పుడు రూ. 55గా ఉన్న లీటర్ డీజిల్ ధర ఇప్పుడు రూ.97కు చేరింది.

**తగ్గకపోగా.. బాదుడే బాదుడు**

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రో వాతపెట్టిన ఎన్డీయే సర్కారు.. ధరలు తగ్గినప్పుడు మాత్రం వాటి ధరలను తగ్గించట్లేదు. దీంతో సామాన్యులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. వివరంగా చెప్పాలంటే.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే, దేశీయంగా పెట్రో ధరలు తగ్గాలి. కానీ దానికి విరుద్ధంగా కేంద్రం ఇంధన ధరలను పెంచుకుంటూ పోతున్నది. దీని కోసం ఎక్సైజ్ డ్యూటీ పేరిట అదనపు సుంకాలను విధిస్తున్నది. గత పదేండ్లలో కేంద్రం పెట్రోల్‌పై 109.91 శాతం ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, డీజిల్‌పై ఏకంగా 343.82 శాతం పన్ను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ గణాంకాలు చెప్తున్నాయి. త్వరలో వివిధ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పెట్రో ధరలు తగ్గవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## నువ్వు దేవుడివా?

**అది నిర్ణయించాల్సింది ప్రజలు • ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి సంచలనంగా మారాయి. మనలో దేవుడు ఉన్నాడా? లేదా? అన్నది ప్రజలు నిర్ణయించాలని, మనకు మనం దేవుడిగా అనుకుంటే సరిపోదంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని ఉద్దేశించి భగవత్ పరోక్షంగా పై వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పూణెలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భగవత్ ప్రసంగిస్తూ.. 'ప్రతీ ఒక్కరూ సాధ్యమైనంత మేరకు మంచి పనులు చేయాలి. మంచి పనులతో మనం కీర్తి సంపాదించామో లేదో.. నిర్ణయించాల్సింది ప్రజలు. అంతేగానీ, మనకు మనమే దేవుడిగా అనుకొంటే సరిపోదు. మనం దేవుడా? కాదా? అన్నది నిర్ణయించాల్సింది ప్రజలే' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ తనకు తాను దైవాంశసంభూతుడిగా అభివర్ణించుకొన్నారు. తాను భగవంతుడు పంపిన దేవ దూతగా చెప్పుకొచ్చారు.

## కొవిడ్ నిధులు కాజేశారు!

**గత బీజేపీ సర్కారుపై జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ మధ్యంతర నివేదిక**

1,120 కోట్ల నిధుల దుర్వినియోగం..చర్యలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం



సీఎంకు నివేదికను సమర్పిస్తున్న జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్

బెంగళూరు, సెప్టెంబర్ 6: కర్ణాటకలో మరో కుంభకోణం తెర మీదకు వచ్చింది. గత బీజేపీ హయాంలో కొవిడ్ నిర్వహణకు కేటాయించిన రూ.1,120 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ కన్హ కమిషన్ మధ్యంతర నివేదిక సమర్పించింది. దీంతో ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

**ఉన్నతాధికారులతో కమిటీ**

జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి, తదుపరి చర్యలను సూచించాల్సిందిగా కోరుతూ కర్ణాటక ప్రభుత్వం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం జరిగిన క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు ఇచ్చింది. మరోవైపు ఈ అంశానికి సంబంధించి విచారణను పూర్తి చేసేందుకు జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ గడువును మరో ఆరు నెలలు పొడిగించింది.

**ఆరోపణలు ఏమిటీ?**

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మొదటిసారి లాక్‌డౌన్ విధించిన 2020 మార్చి నుంచి 2022 డిసెంబరు 31 వరకు కొవిడ్ నిర్వహణకు ఖర్చు చేసిన రూ.7,223 కోట్ల నిధుల్లో. రూ.1,120 కోట్ల దుర్వినియోగం జరిగిందని సిద్ధరామయ్య నియమించిన జాన్ మైఖేల్ కమిషన్ తెలిపింది. కాగా ముడా స్కామ్‌కు కౌంటర్‌గానే సిద్ధూ ప్రభుత్వం దీనిని తెరపైకి తెచ్చిందని బీజేపీ ఆరోపిస్తున్నది.

**నా భద్రతకు ముప్పుంది: కర్ణాటక గవర్నర్**

అధికార కాంగ్రెస్ పార్టీ నేతల తీరు వల్ల తన భద్రతకు ముప్పు ఏర్పడిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర హోం శాఖకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు తాను ఇచ్చిన అనుమతిని రాజకీయ పక్షపాతంతో కూడినదిగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రాష్ట్ర మంత్రులు, నేతలు ఉద్దేశపూర్వకంగా ''గో బ్యాక్ గవర్నర్'' ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.



**అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి**

### కశ్మీరీ పండిట్ మహిళ పోటీ

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ శాసన సభ ఎన్నికల్లో రికార్డులు నమోదవడం ప్రారంభమైంది. మూడు దశాబ్దాల్లో తొలిసారి ఓ కశ్మీరీ పండిట్ మహిళ డైజీ రైనా ఈ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఆమె ఢిల్లీలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసేవారు. ఆమె పుల్వామాలోని ఫ్రీసల్ గ్రామ సర్పంచ్ కూడా. ఆమె రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) తరపున బరిలో నిలిచారు. ఈ పార్టీ ఎన్డీయేలో భాగస్వామి. రాజ్‌పొర శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న డైజీ రైనా మాట్లాడుతూ, యువత తమ గళంగా నిలవాలని తనను కోరారని, అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తాను సర్పంచ్‌గా పని చేస్తున్నానని, యువతను కలుస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకుంటూ ఉంటానన్నారు.

## తోడేళ్లతో బహరాయిచ్ గడగడ

యూపీలోని ఈ జిల్లాలో విద్యా సంస్థలు, మార్కెట్లు బంద్

**ఇప్పటికే పది మంది మృత్యువాత.. 35 మందికి గాయాలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): మానవ రక్తం రుచి మరిగి ప్రాణాంతకంగా మారిన తోడేళ్ల బెడదతో యూపీలోని బహరాయిచ్ జిల్లా గడగడలాడుతున్నది. తోడేళ్ల భయంతో పిల్లలు స్కూళ్స్, కాలేజీలకు వెళ్లడం మానేశారు. మార్కెట్లు, దుకాణాలు బంద్ అయ్యాయి. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికే భయపడే దుస్థితి దాపురించింది. మాహ్సీ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాలు భయంతో నిర్మానుష్యంగా మారిపోయాయి.

**50 రోజులుగా భయం భయం**

గడిచిన 50 రోజులుగా జిల్లా వాసులు కంటి మీద కునుకులేకుండా బతుకుతున్నారు. నరమాంస భక్షక తోడేళ్ల దాడిలో 35 మంది ప్రజలు గాయపడ్డారు. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ భేడియా' నిర్వహించి నాలుగు తోడేళ్లను పట్టుకున్నారు. ఇంకా మిగిలిన రెండు తోడేళ్ల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతున్నది.

**దాడులు అందుకే..**

జనావాసాల్లోకి వచ్చి మరీ తోడేళ్లు దాడులు చేయడానికి గల కారణాలపై అటవీశాఖ నిపుణులు గతంలో తమ అనుభవాలను బట్టి పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు. తమ ఆవాసాలను, సంతానాన్ని కాపాడుకోవడానికే తోడేళ్లు ఈ రకమైన దాడులకు తెగబడొచ్చని దూద్వా నేషనల్ పార్క్ మాజీ డైరెక్టర్ సంజయ్ పాఠక్ అభిప్రాయపడ్డారు. సాధారణంగా తోడేళ్లు తమ పిల్లలకు ఎవరైనా హాని తలపెట్టినట్టు భావిస్తే ఈ తరహా దాడులు చేస్తాయన్నారు. బహరాయిచ్‌లో జరుగుతున్న దాడులకు ఇదే కారణం అయి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

## 'సామూహిక రేప్ జరగలేదు'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై సామూహిక రేప్ జరిగిందని జరుగుతున్న ప్రచారాన్ని సీబీఐ తోసిపుచ్చింది. తమకు లభించిన ఆధారాలను బట్టి పోలీసులు అరెస్ట్ చేసిన సంజయ్ రాయ్‌కి మాత్రమే ఇందులో సంబంధం ఉందని శుక్రవారం సీబీఐ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి సోదాలు నిర్వహించింది. ఆయన హయాంలో మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు దాడి చేశారు. ఆయనకు సన్నిహితులైన ముగ్గురి నివాసాలపై కూడా ఈడీ దాడులు చేసింది.

**ముక్కులో వేలు పెట్టుకొంటే**

### మతిమరుపు ముప్పు!

న్యూయార్క్, సెప్టెంబర్ 6: ముక్కులో వేలు పెట్టుకొనే అలవాటు ఉంటే వెంటనే మానేయండి. లేకపోతే మీకు మతిమరుపు వచ్చే ప్రమాదం ఉన్నదట. ముక్కులో వేలు పెట్టుకొన్నప్పుడు మెదడుకు, ముక్కుకు అనుసంధానమై ఉండే నాళం (నాసల్ ఎపిథీలియం) ద్వారా బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ మెదడులోకి చేరి మెదడు కణాలను దెబ్బతీస్తాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ ది మెడికల్ సైన్సెస్‌లో ప్రచురితమైన అధ్యయనంలో పేర్కొన్నారు.

### కాంతి ప్రసరణతో సూపర్ కెపాసిటర్ చార్జింగ్

బెంగళూరు, సెప్టెంబర్ 6: బెంగళూరులోని ఐఐఎస్సీ ఇనుస్టుమెంటేషన్ అండ్ అప్లయిడ్ ఫిజిక్స్ విభాగం పరిశోధకులు సరికొత్త సూపర్ కెపాసిటర్‌ను అభివృద్ధి చేశారు. దీనిపై కాంతిని ప్రసరింపజేస్తే చాలు.. రీచార్జ్ అవుతుంది. వీధి బల్బులు, వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఈ సూపర్ కెపాసిటర్లను వినియోగించవచ్చునని బెంగళూరులోని ఐఐఎస్సీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కెపాసిటర్ అనేది విద్యుత్తు శక్తిని నిల్వ చేసే పరికరం. సాధారణ కెపాసిటర్‌తో పోల్చితే ఎన్నో రెట్లు సామర్థ్యం కలిగినదే..'సూపర్ కెపాసిటర్'. సెల్ ఫోన్లలో పవర్ చిప్స్‌గా కూడా వీటిని వాడొచ్చు.

### అగ్ని-4 క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ పరీక్షను భారత్ శుక్రవారం విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యస్థ రేంజ్ క్షిపణి అయిన అగ్ని-4ను ఒడిశాలోని చాందీపూర్‌నుంచి ప్రయోగించినట్టు అధికారులు తెలిపారు.భారత న్యూక్లియర్ కమాండ్ అథారిటీలో భాగమైన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ దీనిని నిర్వహించిందన్నారు. అగ్ని-4తో లక్ష్య పరిధి మరింత పెరిగింది. 4 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది ఛేదిస్తుంది. 20 మీటర్ల పొడవున్న ఈ క్షిపణి వెయ్యి కేజీల పేలోడ్‌ను మోసుకుపోగలదు.





### లాల్‌బాగ్ గణపతికి 20 కిలోల బంగారు కిరీటం

*ముంబై, సెప్టెంబర్ 6: ముంబైలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు పేరొందిన లాల్‌బాగ్ గణపతి(లాల్‌బాగ్‌చా రాజా)కి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ 20 కిలోల బంగారు కిరీటాన్ని సమర్పించారు. గత 15 ఏండ్లుగా ఏటా లాల్‌బాగ్ గణపతి ఉత్సవాల్లో అనంత్ అంబానీ చురుగ్గా పాల్గొంటున్నారు. ఉత్సవ కమిటీకి సైతం ఆయన ఎగ్జిక్యూటివ్ అడ్వైజర్‌గా ఉన్నారు. కాగా, ఈ ఏడాది లాల్‌బాగ్ గణపతి విగ్రహ రూపాన్ని గురువారం ఆవిష్కరించారు.*

## పంతుళ్ల పల్లె!



*బెంగళూరు, సెప్టెంబర్ 6: విద్య లేని వాడు వింత పశువు అన్నారు. అందుకేనేమో.. ఈ గ్రామంలో అందరూ విద్యావంతులే కాదు.. విద్య నేర్పేవారు ఇంటికొకరు ఉన్నారు. అందుకే ఈ గ్రామాన్ని 'పంతుళ్ల పల్లె' అని కూడా పిలుస్తుంటారు. ఇంచల్.. కర్ణాటకలోని బెళగావి జిల్లా సావడట్టి తాలూకాలోని ఓ గ్రామం. గ్రామ జనాభాలో పది శాతం అనగా 600 మంది ఉపాధ్యాయులు గ్రామంలోని దాదాపు ప్రతి కుటుంబంలో ఒకరు ఉపాధ్యాయ వృత్తిని తమ జీవనోపాధిగా ఎంచుకోవడం విశేషం. సిద్ధ సంస్థాన్‌కు చెందిన ఆధ్యాత్మిక గురువు డాక్టర్ శివానంద భారతి స్వామీజీ దూరదృష్టితో చేపట్టిన చర్యలే నేడు ఆ గ్రామంలో విద్యా కుసుమాలు పరిమళాలు వెదజల్లుతున్నాయి. 1970 దశకంలో ఆ గ్రామంలో ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాల ఉండేది. ఇక్కడ ఉన్నత విద్యా సంస్థల ఆవశ్యకతను గుర్తించిన డాక్టర్ శివానంద భారతి మరికొందరు నిబద్ధతగల టీచర్లతో కలిసి ఓ విద్యా సొసైటీని స్థాపించారు. ఇక్కడ 1984లో గ్రామీణ ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రం ఏర్పడింది. ఈ కేంద్రంలో ఇంచల్ గ్రామానికి చెందిన వారికి ఉచితంగా శిక్షణ, భోజనం సదుపాయం కల్పించారు. 1988 నుంచి సగటున ప్రతి ఏడాది ఇంచల్‌కు చెందిన 20 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందేవారు.*

***దేశ సేవలోనూ ముందంజ***

*దేశ ప్రజలను విద్యావంతులను చేయడం ఎంత ముఖ్యమో.. దేశ రక్షణ కూడా అంతే ప్రాధాన్యం గలదని ఇంచల్‌వాసులు గుర్తించారు. దీంతో చాలా మంది యువకులు దేశ సైన్యంలో చేరేందుకు సిద్ధపడ్డారు. ఇంచల్ గ్రామానికి చెందిన 300 మందికిపైగా యువకులు నేడు దేశ త్రివిధ దళాల్లో సేవలందిస్తున్నారు.*



### 9 కోట్ల రాయిని మెట్టుగా వాడుకొంది

*న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ప్రపంచంలోనే ఇప్పటివరకు ఉన్న వాటిల్లో అతిపెద్దదైన అంబర్ శిలాజాన్ని రొమేనియాలో విచిత్రమైన పరిస్థితిలో గుర్తించారు. చెట్ల నుంచి వెలువడే ఒక రకమైన స్రావం గట్టిపడి, కొన్ని వేల సంవత్సరాల తర్వాత అంబర్ శిలాజంగా ఏర్పడుతుంది.దాదాపు 3.8 నుంచి 7 కోట్ల సంవత్సరాల క్రితం నాటి ఎర్రటి రాయి(అంబర్ శిలాజం) రొమేనియాలోని కోల్టి అనే గ్రామానికి చెందిన ఓ బామ్మకు దొరికింది. సుమారుగా 3.5 కిలోలున్న ఈ రాయిని గుమ్మం ముందు మెట్టుగా ఆమె కొన్నేండ్లపాటు వాడింది. ఆమె ఇంట్లో చోరీకి వచ్చిన దొంగలు సైతం దాని ప్రత్యేకతను గుర్తించలేకపోయారు. చివరికి ఆ బామ్మ తరపు బంధువు ఒకరు దానిని గుర్తించారు. దాని విలువ రూ.9.2 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.*



### వాహనాల శబ్దాలతో పురుషులకు వంధ్యత్వం

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): వాహనాలు చేసే పెద్ద శబ్దాలు పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని డెన్మార్క్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనంలో తేలింది. వాహన శబ్దాల కారణంగా 37 ఏండ్లు పైబడిన పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. శబ్ద కాలుష్యం కారణంగా 35 ఏండ్లు పైబడిన మహిళల సంతానోత్పత్తి సామర్థ్యంపై కూడా ప్రభావం పడుతున్నట్టు వెల్లడించారు. దీనికి గల శాస్త్రీయ కారణాలపై లోతైన పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. మరోవైపు ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వచ్చే పెద్ద శబ్దాల వల్ల మనుషుల్లో రక్తపోటు పెరుగుతున్నట్టు యూకే పరిశోధకులు తెలిపారు.*